

విద్యా పరిమళాలు
సామాజిక స్పృహ కల్పించిన ప్రజాకవి పేరుతో ఏర్పాటైన యోగివేమన విశ్వ విద్యాలయం వ్యవస్థాపక. వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా.)	సహర్ ఆది (ఉ.)
కడప	6.30	5.03
పులివెందుల	6.33	4.58
ప్రొద్దుటూరు	6.32	5.07

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 38.2 /24.4

జిల్లాలో శుక్రవారం 24.4 -38.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.64 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -వైవీయూ

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పది పరీక్షలు
వైవీయూ: జిల్లా వ్యాప్తంగా 153 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన గణితం పరీక్షకు 28,906 మంది హాజరుకాగా, 613 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ ఎం. అనూరాధ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 13 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 13 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా, డీఈఓ ఎం. అనూరాధ 7 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల పరిశీలకులు ఎం. వెంకటకృష్ణారెడ్డి 9 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ తెలిపారు.

ఓపెన్ పరీక్షలు..
వైవీయూ: జిల్లాలో జరుగుతున్న ఓపెన్ ఇంటర్, పదవ తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం నాటి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి అనూరాధ తెలిపారు. పదవ తరగతి పరీక్షను 13 సెంటర్లలో నిర్వహించామన్నారు. ఈ పరీక్షకు 2231 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2022 మంది హాజరు అయ్యారని, 229 మంది గైర్హాజరయ్యారన్నారు. తనతోపాటు పరీక్షల జిల్లా పరిశీలకులు వెంకట కృష్ణారెడ్డి పరీక్షలను పర్యవేక్షించారని ఆమె వివరించారు. ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 28 కేంద్రాలలో 3735 మందికిగాను 3514 మంది హాజరయ్యారన్నారు. 221 మంది గైర్హాజరు కావడం జరిగిందన్నారు. 13 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 41 కేంద్రాలను పరిశీలించాయన్నారు.

కార్మికుల పట్ల జాగ్రత్తలు పాటించాలి
కడప కోటిరెడ్డిసర్కిల్: రోజురోజుకు ఉష్ణోగ్రతలు, వడగాల్పులు అధికమవుతున్న తరుణంలో పరిశ్రమల యాజమాన్యాలు, నిర్మాణ పనుల యజమానులు, పెద్ద యజమానులు కార్మికుల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని కార్మికశాఖ సహాయ కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. వడగాల్పుల నుంచి ఉపశమనం పొందేందుకు కార్మికులకు పనుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీటి సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. అలాగే కార్మికుల చేత ఉదయం 11.00 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4.00 గంటల తర్వాత పనులు చేయించుకోవాలని ఆయన సూచించారు.


3న ఎస్సీ రాజకీయ చైతన్య వేదిక సభ
కడప రూరల్: ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 3వ తేదీన కడప వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే రాజకీయ చైతన్య వేదిక సమావేశం జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజ తెలిపారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం సర్కిల్ వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీల ఐక్యత, అభ్యున్నతి కోసం నిర్వహించే సమావేశంను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కొట్టం సుబ్బారావు, నాయకులు కొండూరు వెంకటేష్ ఎం శివ, అంజనేయులు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతరం.. నవశకం

భావితరాల భవిష్యత్‌ను నిర్దేశించడంలో ఓటు ప్రధాన భూమిక పోషిస్తుంది. దేశాభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేస్తుంది.ప్రతి ఎన్నికల్లో యువత ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఫలితాల సరళిని ప్రభావితం చేస్తున్నాయి.జిల్లాలో కొత్తగా వేలాది మంది నవ ఓటర్లు నమోదయ్యారు.

- ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకం
- కొత్తగా నమోదైన వారు 39,875
- జిల్లా మొత్తం ఓటర్లు 16.22 లక్షలు
- 18-39 వయస్సు ఓటర్లు 7,52,169





నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	యువ ఓటర్లు	శాతం
బద్వేలు	217769	4722	2.2
కడప	274266	4991	1.8
పులివెందుల	227453	4587	2.0
కమలాపురం	200222	4429	2.2
జమ్మలమడుగు	240835	5519	2.3
ప్రొద్దుటూరు	246726	5495	2.2
మైదుకూరు	209278	4568	2.2

కడప సెవెన్‌రోడ్స్: రానున్న పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ సార్వత్రిక ఎన్నికల్లో యువత కీలకం కానుంది. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల భవితవ్యాన్ని వీరు నిర్ణయించనున్నారు. వీరు ఎటువైపు మొగ్గితే అటువైపు విజయం తథ్యం కానుంది. ఎన్నికల్లో అభ్యర్థుల తలరాతలు లిఖించేది యువశక్తేనని మరోమారు రుజువు కానుంది. జిల్లాలోని మొత్తం ఓటర్లలో 18-39 సంవత్సరాల యువత దాదాపు సగం మంది ఉండటమే ఇందుకు కారణం.

- జిల్లాలో ప్రొజెక్టెడ్ పాపులేషన్ 22.47 లక్షలు. ఇందులో 16.22 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 7.92 లక్షలు, మహిళలు 8.29 లక్షలు, థర్డ్ జెండర్ 214 మంది ఉన్నారు. ఈపీ రేషియో 722గా ఉంది. జిల్లా జనాభాలో 18-19 సంవత్సరాల యువత 86,644 మంది ఉన్నారని అంచనా. జనాభాలో వీరు 3.86 శాతం ఉన్నారు. జనవరి 22న విడుదలైన తుది జాబితా నాటికి వీరిలో 34,311 మంది ఓటర్లుగా నమోదయ్యారు. మొత్తం జనాభాలో 18-19 ఓటర్లు 1.53 శాతం. అంటే 18+ జనాభాలో ఓటర్లుగా నమోదైంది 1.98 శాతం.
- తుది జాబితా తర్వాత 18-19 ఓటర్ల సంఖ్య 39,875కు చేరింది. ఇంకా నమోదుకు గడువు ఉంది గనుక ఆ సంఖ్య మరికొంత పెరిగే అవకాశాలు ఉన్నాయి. 20-29 వయస్సు జనాభా 425548 మంది. మొత్తం జనాభాలో వీరు 18.94 శాతం ఉన్నారు. వీరిలో 2,97,276 మంది ఓటర్లుగా నమోదయ్యారు. మొత్తం జనాభాలో ఇది 13.23 శాతం. కాగా ఓటరుగా నమోదుకు అర్హులైన జనాభాలో ఇది 17.18 శాతం. ఇక 30-39 వయస్కుల జనాభా 3,65,571గా ఉన్నారని అంచనా వేశారు. జనాభాలో ఇది 16.27 శాతం. అయితే తుది జాబితా నాటికి 4,15,018 మంది ఓటర్లుగా నమోదయ్యారు. మొత్తం జనాభాలో ఈ ఓటర్ల శాతం 18.47. అర్హత కలిగిన వారిలో వీరు 23.99 శాతం మంది ఓటర్లుగా నమోదయ్యారు.
- జిల్లాలో 18-39 వయస్సుగల యువత ప్రొజెక్టెడ్ పాపులేషన్ 8,77,763 మందికాగా, 7,52,169 మంది ఓటరుగా నమోదయ్యారు. అంటే జిల్లాలో మొత్తం ఓటర్లు 16.22 లక్షల మంది ఉండగా, అందులో 18-39 యువత దాదాపుగా సగభాగం ఉంది.

సంతోషంగా ఉంది


18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావడానికి భారత ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అధికార యంత్రాంగం నిర్వహించిన సిస్టమ్యాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమం వల్ల అవగాహన ఏర్పడింది. దీంతో ఓటరుగా నమోదు చేసుకున్నాను. రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటాను. ఈ అవకాశం లభించడం చాలా సంతోషంగా ఉంది. - ఎం.హిమకర్‌రెడ్డి, హౌసింగ్‌బోర్డుకాలనీ, కడప

దేశ భవిష్యత్తు నిర్ణయంలో నేనూ....


ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం-2024లో నేను కొత్త ఓటరుగా నమోదు అయ్యాను. స్వీప్ కార్యక్రమం ఇందుకు తోడ్పడింది. రానున్న లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయబోతున్నాను. దేశ భవిష్యత్తు నిర్ణయంలో నేనుకూడా భాగస్వామి కానుండడాన్ని ఊహించుకుంటే ఎంతో సంతోషంగా ఉంది. - టి.సౌమ్య, కడప

మంచి పాలకులను ఎన్నుకునే అవకాశం


నేను కొత్తగా ఓటరుగా నమోదయ్యాను. మే 13న జరగనున్న పార్లమెంటు, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వేయబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మంచి పాలకులను ఎన్నుకునే అవకాశం నాకు లభించింది. ఇంకా నమోదుకు గడువు ఉంది. మా స్నేహితులకు కూడా చెప్పి ఓటరుగా నమోదు కావాలని కోరతాను. - పి.వెంకట కీర్తన, కడప

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు



కళ్యాణ వేదిక పరిసరాలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు అన్నారు. శుక్రవారం ఒంటిమిట్ట ఆలయ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను కడప డీఎస్పీ షరీఫ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆలయ, కళ్యాణ వేదిక పరిసరాలను, ట్రాఫిక్ మళ్లింపుగల లింక్ రోడ్లను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావు, ఒంటిమిట్ట టీటీడీ విజిలెన్సు అధికారి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదు
కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ప్రజలు రూ. 50 వేలకు మించి నగదును ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తీసుకెళ్లరాదని జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణాధికారి నాగరాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణయించిన కంటే అధిక మొత్తంలో నగదు తీసుకు వెళితే అందుకు సంబంధించి వివరాలు, ఆధారాలు కలిగి ఉండాలన్నారు. సరైన వివరాలు లేనిపక్షంలో నగదును ఎన్నికల సంఘం నియమించిన స్పెషల్ టీంలతో కూడిన అధికారులు సీజ్ చేస్తారన్నారు. అలాగే ప్రజలకు వారి ముఖ్యమైన అవసరాలకు ఇబ్బంది కలగకుండా ఒక కమిటీని, సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల కంట్రోల్ రూము ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీలో నోడల్ ఆఫీసర్లుగా నాగరాజారావు, ఆనంద్‌నాయక్, ఎంఎస్ వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉంటారన్నారు.

అత్యవసర శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు

- పటిష్టంగా ఎంసీసీ అమలు
- 'సువిధ' సేవలపై దృష్టి
- కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: భారత ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాల మేరకు 33 అత్యవసర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రిటర్నింగ్ అధికారులతో మాట్లాడారు. పోలీసు, విద్యుత్, రవాణా, పోస్టల్ తదితర శాఖలతోపాటు ఎన్నికల విధులకు హాజరయ్యే మీడియా ప్రతినిధులకు పోస్టల్ బ్యాలెట్ కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ సీజర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వినియోగాన్ని విస్తృతం చేయాలన్నారు. జిల్లా పరిధిలోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో కూడా నిఘాను పటిష్టం చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం-7లతోపాటు ఫారం-8లను ఈనెల 26వ తేదీలోపు పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదులో అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రమపద్ధతిలో వ్యక్తిగతంగా దాఖలు చేసిన ఫారం-6లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అర్హులను జాబితాలో చేర్చాలని సూచించారు. ఎంసీసీ అమలులో ఉన్న నేపథ్యంలో సువిధ సేవలపై దృష్టి సారించాలన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తీసుకునేలా చూడాలన్నారు. నేరుగా గానీ, ఎన్‌కోర్ పోర్టల్ ద్వారాగానీ అందే దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. అనుమతులు, వినతుల స్వీకరణలో జిల్లా మొదటి స్థానంలో ఉండడం అభినందనీయమన్నారు. శాంతిభద్రతల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్వోలు కొసర్‌భాను, శ్రీనివాసులు, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణ చర్యలు
కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వీలుగా కోడ్ ఉల్లంఘనలపై వస్తున్న ఫిర్యాదులకు తక్షణ చర్యలు చేపడుతున్నామని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ప్రత్యేక పర్యవేక్షణాధికారి జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి పబ్లిక్, ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన పోస్టర్లు, గోడరాతలు, పార్టీ జెండాలు తొలగించడంతోపాటు విగ్రహాలకు ముసుగులు వేశామన్నారు. పబ్లిక్ ప్రాపర్టీకి సంబంధించి 782 గోడరాతలు, 9818 పోస్టర్లు, 3584 బ్యానర్లు, 3333 ఇతరత్రా వాటితో కలిపి మొత్తం 17,517 తొలగించామని వివరించారు. ప్రైవేటు ఆస్తులకు సంబంధించి 1366 వాల్ రైటింగ్స్, 3610 పోస్టర్లు, 1839 బ్యానర్లు, 5717 ఇతరత్రా వాటితో కలిపి మొత్తం 12,532 తొలగించామన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఇప్పటివరకు రూ.80 వేల నగదు, రూ. 14,76,830 లిక్కర్, ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసులతోపాటు షోకాజ్ నోటీసులు, ఉద్యోగుల సస్పెన్షన్లు కూడా జరిగాయన్నారు.

పూటకో మాట.. అయినవారికే పీట

- ఇష్టారీతిన టీడీపీ అధిష్టానం
- టీడీపీ వైఎస్సార్ జిల్లా కీలక నాయకుడిపై మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి గరం గరం
- వరుసగా మూడు సార్లు ఓటమి చెందిన వారికి టికెట్ లేదన్న నారా లోకేష్
- నెల్లూరు జిల్లాలో సోమిరెడ్డికి మినహాయింపు దక్కడంతో మండిపడుతున్న పుత్తా
- ఊరించి, ఆశలు రేకెత్తించి ఉసూరుమన్పించారనే ఆవేదనలో ప్రొద్దుటూరు ప్రవీణ్



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ అధిష్టానం నిబంధనలు, సూత్రాల పేరిట పూటకో మాట చెప్పి.. చివరికి అయినవారి కోసం దానిని తప్పుతోంది. మూడో జాబితా విడుదల తర్వాత టీడీపీ శ్రేణుల్లో ఈ విషయమై తీవ్ర అసంతృప్తి నెలకొంది.

వాసు.. శల్యసారథ్యం

బాధ్యతలను నిర్వర్తించాల్సిన వ్యక్తి ఉద్దేశ్యపూర్వకంగా చెడగొట్టడాన్ని శల్య సారథ్యం అంటారు. అచ్చం అలాంటి పరిస్థితి వైఎస్సార్ జిల్లా కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డికి ఎదురైందని తెలుగుతమ్ముళ్లు విశ్వసిస్తున్నారు. మరోమారు ఎన్నికల్లో తలపడి ఎమ్మెల్యే అనే జీవితాశయం నెరవేర్చుకోవాలనే పట్టుదలతో కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా ఉండేవారు. అంతలోనే 'ఇంట్లో వాడే కంట్లో పుల్ల' అన్నట్లుగా జిల్లాలో టీడీపీ బాధ్యతలు నిర్వహిస్తున్న వాసు(రెడ్డెప్పగారి శ్రీనివాసులు రెడ్డి) కారణంగానే పుత్తాకు టికెట్ దక్కలేదని అభిప్రాయపడుతున్నారు. అధిష్టానానికి తనపై పితూరీలు వల్లించిన కారణంగానే ఈమారు టికెట్ తాను కోల్పోయినట్లు సన్నిహితులతో వ్యాఖ్యానిస్తున్నట్లు సమాచారం. వరుసగా మూడుసార్లు ఓడిపోయినోళ్లకు ఈమారు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదని గతంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించారు. యువగళం పాదయాత్ర, రా కదలిరా... కార్యక్రమాలు ఇన్‌చార్జిగా పుత్తా నరసింహారెడ్డి నాయకత్వంలో కమలాపురం నియోజకవర్గంలో చేపట్టారు. అధిష్టానం స్వయంగా చేపట్టిన పార్టీ కార్యక్రమాలు బాగా నిర్వహించడంతో టికెట్ దక్కుతుందని పుత్తా నమ్మకంగా ఉండేవారు. ఇలాంటి తరుణంలో అనూహ్యంగా పుత్తాను పక్కనబెట్టి ఆయన కుమారుడు చైతన్యరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. ఆదేమంటే వరుసగా మూడు పర్యాయాలు ఓడిపోయినోళ్లకు టికెట్ ఇవ్వలేదని టీడీపీ శ్రేణుల్లో ప్రచారం ఆరంభించారు. అయితే ఇది నిజం కాదని శుక్రవారం రుజువైంది. టీడీపీ మూడో జాబితాలో నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ప్రకటించడంతో ఆ విషయం తేటతెల్లమైంది.

ప్రవీణ్‌ను ఊరించి, ఆశలు రేకెత్తించి...

ప్రొద్దుటూరు టికెట్ నీదే, ఇప్పటి నుంచే ఎన్నికల కసరత్తు చేయాలంటూ ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని యువగళం పాదయాత్ర నుంచి అటు అధిష్టానం, ఇటు జిల్లా కీలకనేత ఊరించి, ఆశలు రేకెత్తించారు. అయితే చివరికి అభ్యర్థుల ప్రకటన నాటికి ఆ జాబితాలో చోటు దక్కలేదు. ఆ స్థానంలో మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి అవకాశం లభించింది. ఐదేళ్లుగా కష్టపడి పార్టీ కోసం శ్రమించి, కేసులు ఎదుర్కొన్న తనను అటు అధిష్టానం, ఇటు జిల్లా నాయకత్వం మోసగించిందనే ఆవేదన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నుంచి వ్యక్తమౌతోంది. అధిష్టానంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ప్రవీణ్ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండిపోయారు. ఈక్రమంలో శుక్రవారం వరద దూతగా ఆయన సోదరుడు నంద్యాల రాఘవరెడ్డి వెళ్లి ఇన్‌చార్జి ప్రవీణ్‌ను కలిసినా సానుకూలంగా స్పందించలేదని తెలిసింది.

కుటుంబానికి ఒక్కటే టికెట్ ఉత్తిమాటే

కుటుంబానికి ఒక్కటే టికెట్ అని.. టీడీపీ అధిష్టానం చెప్పుకొచ్చింది. ఇప్పుడామాట ఉత్తిదేనని రుజువైంది. మైదుకూరు టీడీపీ అభ్యర్థిగా పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ప్రకటించారు. ఆయన కుమారుడు మహేష్‌యాదవ్‌ను ఏలూరు ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. అదే విషయాన్ని మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి ఎత్తి చూపుతున్నారు. రాయచోటి ఇన్‌చార్జిగా పార్టీ ఉన్నతికి ఐదేళ్లు పనిచేసిన తనకు టికెట్ నిరాకరించడాన్ని తప్పు పడుతున్నారు. ఆయన సోదరుడు శ్రీనివాసులరెడ్డి భార్య మాధవీరెడ్డికి కడప టికెట్ ఇచ్చారనే కారణంతో రమేష్‌రెడ్డికి నిరాకరించారు. ఇదే నిబంధన పుట్టా కుటుంబానికి వర్తించాలి కదా అని ఆయన నిలదీస్తున్నారు.

సోమిరెడ్డికి మినహాయింపు

వరుసగా మూడుసార్లు ఓడిపోయినవాళ్లకు టికెట్ లేదనే విషయంలో మాజీ మంత్రి సోమిరెడ్డికి మినహాయింపు దక్కింది. శుక్రవారం ప్రకటించిన జాబితాలో సర్వేపల్లె స్థానం ఆయనకు కేటాయించారు. కాగా 2004 నుంచి 2019 వరకూ సర్వేపల్లె టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వరుసగా నాలుగు సార్లు ఓడిపోయారు. అదనంగా మధ్యలో 2012 ఉప ఎన్నికల్లో కోవూరు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతిలో కూడా ఓడిపోయారు. ఈ లెక్కన వరుసగా ఐదుసార్లు ఓడిపోయిన చరిత్ర ఉన్న సోమిరెడ్డికి దక్కిన టికెట్ తనకు ఎందుకు దక్కలేదని పుత్తా మండిపడుతున్నట్లు సమాచారం. కమలాపురం టీడీపీ అభ్యర్థిగా మూడు సార్లు మాత్రమే ఓడిపోయానని ఎటు చూసినా సోమిరెడ్డి కంటే తానే బెటర్ అనే భావన ఆయన వ్యక్తపరుస్తున్నట్లు తెలుస్తోంది.

పోస్టల్ బ్యాలెట్‌కు పచ్చజెండా

- పట్టాలెక్కినా.. ఇక ఓటు వేయవచ్చు!
- తొలిసారిగా రైల్వే కార్మికులకు అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం
- ప్రత్యేకంగా నోడల్ అధికారి నియామకం



రైలు (ఇన్‌సెట్) పోస్టల్‌బ్యాలెట్


రాజంపేట: భారతదేశంలో అతిపెద్ద రవాణా వ్యవస్థ రైల్వే. అటువంటి రైల్వేలో లక్షలాది మంది కార్మికులు 70 శాతం నిత్యం విధుల్లో ఉంటారు. అటువంటి వారికి ఓటువేసే భాగ్యాన్ని భారత ఎన్నికల సంఘం కల్పించింది. మేము ఎలా ఓట్లు వేయాలని అత్యవసర సేవలందించే సిబ్బంది అనుకునేవారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు వీరంతా కొన్ని దశాబ్దాలుగా ఎమ్మెల్యే, ఎంపీ, స్థానికసంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాల్సి వచ్చేది. తొలిసారిగా పోస్టల్‌బ్యాలెట్‌కు రైల్వేకు కేంద్రఎన్నికల సంఘం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పోస్టల్‌బ్యాలెట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న తరహాలోనే తమకు ఇవ్వాలనే డిమాండ్ ఇన్నాళ్లకు నెరవేరింది. తమకు ఓటు వేసే భాగ్యం కలిగిందని కార్మికులు, ఉద్యోగులు సంబరపడుతున్నారు.

-గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలోని రాయలసీమ జిల్లాల్లో 14వేలమందికిపైగా కార్మికులు, ఉద్యోగులు, అధికారులు ఉన్నారు. ఉభయ వైఎస్సార్ జిల్లా కొండాపురం నుంచి రైల్వేకోడూరు వరకు 2వేలమందికిపైగా కార్మికులు ఉన్నారు.అత్యవసర సేవలో ప్రధానంగా రన్నింగ్‌స్టాఫ్(పైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్, గార్డులు)తో పాటు టీటీఈ, స్టేషన్‌మాస్టర్, ఆరోజు విధుల్లో ఉండే ఇతర విభాగాలకు చెందిన అధికారులు, కార్మికులు తాము నివసించే ఏరియా పోలింగ్‌బూత్‌కు వచ్చి ఓటు వేయలేని పరిస్థితులు నెలకొంటాయి. ప్రస్తుతం వీరు పోస్టల్ బ్యాలెట్‌ద్వారా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ప్రణాళిక సిద్ధం..

మొదటిసారిగా రైల్వేకార్మికులకు భారత ఎన్నికల సంఘం పోస్టల్‌బ్యాలెట్ సదుపాయం కల్పించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తోంది. గతంలో ఈ పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కోరిన రైల్వే అధికారి రాంకుమార్‌కు సమాధానం ఇస్తూ రైల్వేకార్మికులను అత్యవసర సేవల్లో ఉంటున్న ఓటరు విభాగంలో చేర్చి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు.ఇందుకోసం ప్రజాచట్టం 1951 సెక్షన్ 60(క్లాజ్‌సీ)లో పేర్కొన్న వ్యక్తులతోపాటు రైల్వేలో పనిచేస్తున్న రన్నింగ్‌స్టాఫ్, గార్డులు,టీసీలకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించే విధంగా 1961 ఎన్నికల నిబంధనను సవరించినట్లు సమాచారం.

- 33 విభాగాలలో వివిధ సేవల్లో ఉంటూ పోలింగ్‌రోజు ఓటు వేయలేని వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఇందులో రైల్వే రవాణా, మెట్రోలను చేర్చింది. రాష్ట్రంలో లోక్‌సభతోపాటు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వివిధ సేవల్లో నిమగ్నమయ్యే విభాగాలను నోటిఫై చేసింది. ఆయా విభాగాల్లో సేవలందించే వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సౌకర్యం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించడంతోపాటు పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 12 డీఫాం అందుబాటులో ఉంచాలని భారత ఎన్నికలసంఘం గత మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది.

ఎన్నికల రోజు విధుల్లో ఉన్న వారికి పోస్టల్‌బ్యాలెట్


ఎన్నికల రోజు విధుల్లో ఉన్నవారికి పోస్టల్ బ్యాలెట్ ఇస్తారు. అయితే భారత ఎన్నికల సంఘం ఈసారి 33 విభాగాల్లో పనిచేసే వారికి ఈ అవకాశం కల్పించింది. ఈమేరకు ప్రత్యేకంగా నోడల్ అధికారి నియమించాం. రైల్వే ఉన్నతాధికారులతో సంప్రదించిన తర్వాత నోడల్ అధికారి విషయంపై నిర్ణయం తీసుకుంటాం. -టీ.మోహనరావు, రిటర్నింగ్ ఆఫీసర్, రాజంపేట

సీఈసీ నిర్ణయం హర్షణీయం


రైల్వేశాఖలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని భారత ఎన్నికల సంఘం(సీఈసీ) నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. పోస్టల్ బ్యాలెట్ లేకపోవడంతో వేలాదిమంది కార్మికులు తమ ఓటుహక్కును వినియోగించుకోలేని పరిస్థితి. ఇప్పటికైనా రైల్వే కార్మికులకు పోస్టల్ బ్యాలెట్ ఇచ్చే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధం కావడం అభినందనీయం. -విశ్వనాథ్, సెక్రటరీ, ఎస్ఆర్ఎంయూ, నందలూరు బ్రాంచి

వేమన వెలుగుల్లో.. విద్యా పరిమళాలు

- నేడు వైవీయూ 18వ వార్షికోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథులుగా ఎస్వీయూ, ఏఎఫ్‌యూ వీసీలు


వైవీయూ ముఖద్వారం

వైవీయూ : యోగివేమన నీకు వందనం.. విశ్వకవి తాత్వికా నీకు వందనం.. అన్న విశ్వవిద్యాలయ గీతంతో ఉత్తేజితులవుతూ.. సామాజిక స్పృహ కల్పించిన ప్రజాకవి పేరుతో ఏర్పాటైన యోగివేమన విశ్వవిద్యాలయం 18వ వ్యవస్థాపక, వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. 2006 మార్చి 9వ తేదీన పీజీ కేంద్రం నుంచి విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెంది నేడు 27 కోర్సులతో విలసిల్లుతోంది. దాదాపు 1500 మంది విద్యార్థులు, 100 మంది అధ్యాపక బృందం, 300 మంది దాకా బోధనేతర సిబ్బంది, 100 మంది దాకా పరిశోధక విద్యార్థులతో ప్రగతి పథంలో దూసుకువెళ్తోంది. 1977 నవంబర్ 20వ తేదీన తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం కడప నగర సమీపంలో పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2006లో 652 ఎకరాల్లో విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకుంది.

అభివృద్ధికి అడుగులు.. ఇలా...

యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విశ్వవిద్యాలయానికి నిధుల వరద పారించారు. వైవీయూకు 2012లో 12బీ గుర్తింపు సైతం లభించడంతోపాటు పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు, ప్రపంచ పరిశోధకుల జాబితాల్లో స్థానం, పలు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులను విశ్వవిద్యాలయ అధ్యాపక బృందం సొంతం చేసుకున్నారు. అదే విధంగా 2022 నవంబర్‌లో విశ్వవిద్యాలయం న్యాక్ ఏ గ్రేడ్ సాధించి సత్తా చాటింది. విశ్వవిద్యాలయం 2023 జూన్‌లో విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో దేశంలోని అత్యుత్తమ విద్యాలయాల్లో 151 నుంచి 200 లోపు స్థానం సాధించింది. వీటితోపాటు పలు అవార్డులు, పలు ప్రాజెక్టులు సొంతం చేసుకుని అభివృద్ధి బాటలో పయనిస్తోంది.

గ్రంథాలయ ప్రాంగణంలో..

న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన తర్వాత సరికొత్త హంగులతో విలసిల్లుతున్న విశ్వవిద్యాలయంలో శనివారం ఉదయం 10.00 గంటలకు వైవీయూలోని ఏపీజే అబ్దుల్‌కలాం కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో 18వ వ్యవస్థాపక, కళాశాల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. వాస్తవానికి మార్చి 9వ తేదీన వ్యవస్థాపక దినోత్సవం రోజునే వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ కాగా, వరుసగా సెలవులు రావడంతో విద్యార్థులు అందుబాటులో లేకపోవడంతో 23వ తేదీ శనివారం నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య వి.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్, న్యూఢిల్లీకి చెందిన ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ వై.సురేష్‌రెడ్డి విచ్చేయనున్నారు.

క్లుప్తంగా

నారా భువనేశ్వరి పర్యటనలో జేబుదొంగల చేతివాటం

బి.కోడూరు : నిజం గెలవాలి పేరిట నారా భువనేశ్వరి చేపట్టిన పర్యటనలో జేబుదొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఆమె శుక్రవారం మండలంలోని గుంతపల్లె గ్రామానికి చెందిన గొర్రెడ్డి ఓబుల్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చారు. ఈ పర్యటనలో జేబుదొంగలు హల్‌చల్ చేసి పలువురి జేబులు కత్తిరించి సుమారు రూ.50 వేలు పైగా దొంగలించినట్లు బాధితులు వాపోయారు. భువనేశ్వరిని చూసేందుకు వచ్చిన సుబ్బరాయుడుతోపాటు మరికొంత మంది జేబులను కట్ చేశారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘన – విధుల నుంచి ఇరువురి తొలగింపు

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన ఇరువురిని విధుల నుంచి తొలగించినట్లు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్ భానో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ఎన్నికలు –2024కు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 16న షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎం.సి.సి.) అమలుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధి ప్రొద్దుటూరు మున్సిపాలిటీ గాంధీ నగర్ రోడ్డులోని ఏపీ.ఎస్.బీ.సీ.ఎల్. ఔట్ లెట్ (12198) షాపులో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న ఓబులేసు, సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న నగేష్‌లు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు ఎక్సైజ్ సీఐ, మున్సిపల్ కమిషనర్ విచారణలో నిజనిర్ధారణ కావడంతో నగేష్, ఓబులేసులను ఏపీఎస్ బీసీఎల్ డిపో మేనేజర్ విధుల నుంచి తొలగించామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోక తప్పదని, ఎన్నికల విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్



కప్ అందుకుంటున్న మానస, సూర్య ఫాతిమా

ప్రొద్దుటూరు క్రైం : వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న స్టాఫ్ నర్స్ బి.మానసకు బంగారు పతకం లభించింది. మరో స్టాఫ్‌నర్స్ సూర్య ఫాతిమ అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఈ నెల 18 నుంచి 22 వరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లను ఢిల్లీలో నిర్వహించారు. జిల్లా ఆస్పత్రి నుంచి నర్సింగ్ ఆఫీసర్లుగా పని చేస్తున్న బి.మానస, షేక్ సూర్య ఫాతిమాలు పాల్గొన్నారు. ఇందులో భాగంగా వెయిట్ లిఫ్టింగ్‌లోని 55 కేజీల క్యాటగిరి, పవర్ లిఫ్టింగ్‌లోని 52 కేజీల క్యాటగిరీల్లో మానస స్వర్ణ పతకాలు సాధించారు.

అద్భుత ప్రతిభ కనబరిచిన సూర్య ఫాతిమా

జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న మరో నర్సింగ్ ఆఫీసర్ షేక్ సూర్య ఫాతిమా వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లలో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నారు. ఈ రెండు విభాగాల్లోని 76 కేజీల కేటగిరిలో సూర్య ఫాతిమా 4వ స్థానంలో నిలిచారు. ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు మహిళల చాంపియన్‌షిప్‌ను సాధించారు. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో శుక్రవారం సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డు ప్రతినిధి మహేష్ ఇరువురికి మెడల్స్‌ను బహూకరించారు. రెండు విభాగాల్లో మంచి ప్రతిభ కనబరచిన మానస, సూర్య ఫాతిమాలను డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణెమ్మ, నర్సింగ్ సిబ్బంది అభినందించారు.

విధుల్లో ఉత్తమ ప్రతిభకు ప్రశంస

నలుగురు పోలీసులకు వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందచేత

కడప అర్బన్ : పోలీస్ సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డ్‌ను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇద్దరు సివిల్, ఎస్ఈబీ, ఏఆర్ విభాగాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసాపత్రం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

- ఎన్నికల నేపథ్యంలో కొండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముచ్చుమర్రి క్రాస్ వద్ద వాహన తనిఖీల్లో ఓ వ్యక్తి ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ. 9.68 లక్షలు నగదు స్వాధీనం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుల్ డి. నరసింహులు (పి.సి.1409), కె మద్దిలేటి (పి.సి 2681)లకు ప్రశంసా పత్రం అందజేశారు.
- పోలీస్ సిబ్బందికి నిర్వహిస్తున్న యాంటీ-రయట్ డ్రిల్‌ను సిబ్బందికి తర్ఫీదు ఇవ్వడంలో కీలకపాత్ర పోషించిన ఏ.ఆర్ కానిస్టేబుల్ పి.చిట్టిబాబు (ఏఆర్ పీసీ 3241)ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.
- ఇటీవల బద్వేలులో అక్రమంగా తరలిస్తున్న 72 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కానిస్టేబుల్ ఎం.గురుప్రసాద్‌కు నగదు రివార్డు, ప్రశంసాపత్రం అందజేశారు.
- వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్న సిబ్బంది మున్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

మెడికల్ షాపుపై విజిలెన్స్ దాడులు


మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

వల్లూరుపేట : మండలంలోని నాగలగుట్టపల్లెలో ఉన్న విజయలక్ష్మి మెడికల్ షాపుపై శుక్రవారం విజిలెన్స్ డ్రగ్స్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దాడులు చేశారు. కాలం చెల్లిన మందులతోపాటు పశువుల మందులు కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 35 రకాల శ్యాంపుల్ మందులను సీజ్ చేసి తీసుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని అంచనా వేశారు. అలాగే మెడికల్ షాపునకు అనుసంధానంగా ఉన్న గురుదత్త ప్రైవేటు వైద్యశాలను తనిఖీ చేశారు. వైద్యశాల నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో సీజ్ చేశారు. శ్యాంపుల్ మందులను లక్కిరెడ్డిపల్లె మెజిస్ట్రేట్ కోర్టుకు సమర్పిస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కడప రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మానుంబాషా ఆదేశాల మేరకు విజిలెన్స్ డీఎస్పీ నాగరాజరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రెడ్డెప్ప, అసిస్టెంట్ జియాలజిస్టు శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి బాల గంగాధరరెడ్డి, కిషోర్, ఏఈఈ బాబు మోజెస్, జీఎస్టీవో వెంకట చంద్రారెడ్డి, సీహెచ్ఎస్ కిరణ్ కుమార్‌రెడ్డి, కడప, రాయచోటి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు మాధవి, జయరాముడు, సురభి వైద్యాధికారి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సున్నపురాళ్లపల్లెలో చోరీ

యర్రగుంట్ల : మండల పరిధి సున్నపురాళ్లపల్లె గ్రామంలోని తాడిమె సరస్వతమ్మ ఇంటిలో చోరీ జరిగింది. ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తాడిమె సరస్వతమ్మ చెన్నూరు మండలంలోని రామనపల్లె గ్రామంలో ఉన్న తమ కుమార్తె వద్దకు వెళ్లింది. శుక్రవారం ఉదయం తిరిగి వచ్చి చూసుకోగా ఇంటి తలుపు తెరిచి ఉండటంతో ఆందోళనకు గురైంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సుమారు 2 తులాలు బంగారు, రూ. 20 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

కడప శ్రీనగర్ కాలనీలో..

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధి శ్రీనగర్ కాలనీలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి కదిరి నరసింహులు ఇంటిలో దొంగలు పడి 9 తులాల బంగారు ఆభరణాలను, డబ్బులను దోచుకుని వెళ్లారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లి, తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చారు. తాళాలు పగులగొట్టి ఇంటిలోకి చొరబడి బంగారు ఆభరణాలను, డబ్బులను దోచుకుని వెళ్లినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే రిమ్స్ పీఎస్ పరిధిలో దొంగలు పడి ఓ ఇంటిలో నగదును దోచుకుని వెళ్లినట్లు సమాచారం.

పాత సామాన్ల దుకాణంలో..

కడప నగరంలోని బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో పటేల్‌రోడ్డు సమీపంలో వున్న పాత సామాన్ల దుకాణంలో శుక్రవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి చొరబడి గల్లా పెట్టెలోని దాదాపు రూ.20 వేలు నగదును, సెల్‌ఫోన్‌ను దోచుకుని వెళ్లాడు. వెంటనే దుకాణం నిర్వాహకురాలు సల్మా డయల్ 100కు ఫోన్ చేసింది. వెంటనే రక్షక్ వాహనంలో పోలీసులు వచ్చి పరిశీలించి ఫిర్యాదును స్వీకరించారు.

నీటి పొదుపు భావితరాలకు మేలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

కడప సిటీ : నీటిని పొదుపు చేస్తే భావితరాలకు మేలు జరుగుతుందని, లేని పక్షంలో కష్టాలు పడాల్సి వస్తుందని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ తెలిపారు. స్థానిక తెలుగుగంగ ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ జడ్జి బాబా ఫకృద్దీన్ పాల్గొని మాట్లాడారు. మార్చి 22న ప్రపంచ జల దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి తీర్మానించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ నీటి దినోత్సవాన్ని పాటించాలన్న ఆలోచన, పర్యావరణం, ప్రగతి అనే అంశంపై బ్రెజిల్‌లోని రియో డిజనీరియో వేదికగా 1992లో జరిగిన ఐక్యరాజ్య సమితి సమావేశంలో రూపుదిద్దుకుందన్నారు. అప్పటి నుంచి మార్చి 22న యేటా ప్రపంచ నీటి దినోత్సవంగా పాటిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఎవరినీ వదిలిపెట్టను (లివింగ్ నో వన్ బిహైండ్) అనే నినాదాన్ని ఐక్యరాజ్య సమితి ప్రకటించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 2030 నాటికి ప్రతి ఒక్కరికీ పరిశుభ్రమైన నీటిని అందజేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అనంతరం 2004 సంవత్సరం ప్రపంచ నీటి దినోత్సవ ప్రచార థీమ్‌ను (శాంతికోసం నీరు) ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టుల సీఈ ఎం.మల్లికార్జునరెడ్డి, ఎస్ఈలు వెంకట్రామయ్య, శారద, శ్రీనివాసులు, ఇలియాస్‌బాషా, మనోహర్, పారా లీగల్ వలంటీర్ సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆవు పొడిచి రైతుకు తీవ్ర గాయాలు

పెద్దతిప్పసముద్రం : స్థానిక పంచాయతీ పరిధిలోని కుమ్మరవారిపల్లిలో శుక్రవారం రామక్రిష్ణ (49) అనే రైతును ఆవు పొడవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఇదే గ్రామానికి చెందిన చలపతి అనే ఆవు యజమాని ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లగా.. ఆవుకు నీళ్లు తాపాలని ఫోన్ ద్వారా రామక్రిష్ణకు సూచించాడు. దీంతో షెడ్డు కింద ఉన్న ఆవుకు నీళ్ల తాపేందుకు ప్రయత్నించగా రామక్రిష్ణ పీవు భాగంలో పొడచి తీవ్రంగా గాయపరచింది. గాయపడిన రైతుకు మండల కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం 108 వాహనంలో మదనపల్లి ఆసుపత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీలోకి రాజుపాళెం మాజీ ఎంపీపీ!

ఎమ్మెల్యే రాచమల్లు, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వెళ్లి ఆహ్వానం


మాజీ ఎంపీపీ ప్రభాకరరెడ్డి ఇంటిలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం : రాజుపాళెం మండలంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతగా ఉన్న మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్సీ, కర్నూలు, నంద్యాల రీజినల్ కోఆర్డినేటర్ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆహ్వానించారు. శుక్రవారం మండలంలోని చిన్నశెట్టిపల్లె గ్రామంలో ఉన్న ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వారు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వెళ్లి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రాజకీయ అనుభవం ఉండి ఈ కుటుంబం నుంచి రెండు సార్లు ఎంపీపీగా పని చేసి మండలంలో అత్యధిక బంధు వర్గం కలిగి, మంచి పట్టు ఉన్న నాయకుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 27న ప్రొద్దుటూరులో జరిగే బస్సు యాత్ర సభలో జగనన్న చేతుల మీదుగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకోవడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తన చిన్నాన్న శివారెడ్డి కాలం నుంచి తమ కుటుంబానికి ప్రభాకర్‌రెడ్డి సన్నిహితులని తెలిపారు. మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎప్పటి నుంచో వైఎస్ కుటుంబంతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీగా నిలిచిన సమయంలో తాము సహాయ సహకారాలు అందిందామని తెలిపారు. జరగబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని, మండలంలో అన్ని గ్రామాల నాయకులను కలుపుకొని పార్టీ బలోపేతానికి కష్టపడతామన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు ముందుగా గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు మెట్టుపల్లె బాలమ్మగారి శివశంకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డితోపాటు ఆయన కుమారులు జయంత్‌రెడ్డి, శ్యాంరెడ్డితో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు అసెంబ్లీ పరిశీలకులు హనుమంతరెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శివనాగిరెడ్డి, మెట్టుపల్లె రామ్మోహన్ రెడ్డి, పార్టీ కన్వీనర్ రాజారాంరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 50 కుటుంబాలు చేరిక


పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మద్దే ఖాన్ మసీద్ సవైపురా వీధిలో తెలుగుదేశం పార్టీకి చెందిన 50 కుటుంబాల వారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా వారిని పేరు పేరునా పలకరించి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కరోనా వల్ల ప్రభుత్వం రెండేళ్లు ఆదాయం పూర్తిగా కోల్పోయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెక్కుచెదరని ధైర్యంతో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. జగన్ సంక్షేమ పాలనకు ఆకర్షితులై చాలా మంది యువకులు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో అక్రమ్, ఇర్ఫాన్, హబీబ్, మస్తాన్, బిజిలి, అబ్దుల్లా, జాఫర్, ఖాదర్ బాషా, ఇస్మాయిల్, రియాజ్, రిహాన్, సోహెల్, అల్లాబకాష్ వారి మిత్ర బృందం ఉన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నగర అధ్యక్షుడు పవర్ అల్తాఫ్, యువజన నగర అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, పార్టీ నాయకులు పి.జయచంద్రారెడ్డి, మున్నా, దాక్టెట్ గౌస్, కమాల్‌బాషా, రఘునాథ్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మియ్యా తదితరులు పాల్గొన్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

పాఠశాలకు అన్ని సౌకర్యాలు



నాడు-నేడు కింద మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలకు అన్ని సౌకర్యాలు సమకూరాయి. నూతనంగా గదులు నిర్మించారు. బాత్‌రూములు, లెట్రిన్‌లు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. తరగతి గదిలో ఫర్నీచర్, ఇతర సదుపాయాలు కల్పించారు. దీంతో మా పాఠశాల విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు.

– భాస్కరన్, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, బసినికొండ, మదనపల్లె మండలం

నెరవేరిన సొంతింటి కల



మేము పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న రజక కాలనీలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాము. గత ప్రభుత్వ హయాంలో అనేకమార్లు ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నవరత్నాల్లో భాగంగా పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారు. జగనన్న కాలనీలో నాకు ఇల్లు మంజూరు కావడంతో సొంతింటి కల నెరవేరింది. మా కుటుంబ సభ్యులందరం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– మహేశ్వరి, లబ్ధిదారురాలు, పులివెందుల

24న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అరుణాచలగిరి ప్రదక్షిణ కోసం ఈ నెల 24వ తేదీన తిరువణ్ణామలైకి రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప డిపో నుంచి ఉదయం 5 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా తిరువణ్ణామలైకి బస్సు బయలుదేరుతుందన్నారు. సూపర్‌లగ్జరీ బస్సులో రూ. 1072గా చార్జి నిర్ణయించారన్నారు.
- బద్వేలు డిపో నుంచి ఉదయం 7 గంటలకు గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా, మరొక బస్సు అదే సమయంలో పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళుతుందన్నారు. అల్ట్రా డీలక్స్ సర్వీసులో రూ.1566, సూపర్ లగ్జరీలో రూ. 1475గా చార్జి ఉంటుందన్నారు.
- మైదుకూరు డిపో నుంచి పోరుమామిళ్లలో ఉదయం 6 గంటలకు, మరొక బస్సు సాయంత్రం 6 గంటలకు మైదుకూరు నుంచి కడప మీదుగా వెళుతుందన్నారు. ఇందులో రూ.1214, రూ.1414 చార్జిగా ఉంటుందన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరే బస్సు కడప మీదుగా వెళుతుందన్నారు. ఇందులో రూ.1273గా చార్జి ఉంటుందన్నారు.
- జమ్మలమడుగు నుంచి రాత్రి 8 గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా బస్సు బయలుదేరుతుందన్నారు. టిక్కెట్ ధర రూ.1352గా ఉందన్నారు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలంకు సర్వీసు వెళుతుందన్నారు. ఇందులో రూ.1242 టిక్కెట్ ధరగా నిర్ణయించారన్నారు.
- ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

రాయచోటి టౌన్ : మమ్మల్ని ఎవరూ కిడ్నాప్ చేయలేదని ప్రేమజంట జిల్లా ఎస్పీ కృష్ణారావును ఆశ్రయించారు. ప్రేమికుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం నందలూరుకు చెందిన అర్షద్ తిరుపతికి చెందిన ఒక అమ్మాయిని ప్రేమించాడు. అయితే వీరి ప్రేమను అమ్మాయి బంధువులు ఒప్పుకోకపోవడంతో.. అతను ముంబయికి వెళ్లిపోయాడు. అమ్మాయి తనకు ఇష్టం లేని వివాహం చేస్తున్నారని తెలుసుకొని ఇంటిలో ఎవరికీ తెలియకుండా గత కొన్ని రోజుల క్రితం ముంబయికి వెళ్లింది. దీంతో తమ కుమార్తెను ఎవరో కిడ్నాప్ చేశారని అమ్మాయి తల్లిదండ్రులు తిరుపతి పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో విచారణ చేపట్టారు. ఆమె రాజంపేటకు చెందిన అర్షద్ వద్ద ఉన్నట్లు తేలడంతో వీరిని అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయానికి తీసుకొచ్చారు. అయితే వీరు మాత్రం తమను ఎవరూ కిడ్నాప్ చేయలేదని ఎస్పీకి చెప్పడంతో వారి కుటుంబ పెద్దలను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.